భక్తుల కొంగుబంగారం

- రామస్వామి గుట్టపై వీరబ్రహ్మేంద్రస్వామి
- ఆరేండ్లుగా కొనసాగుతున్న వివిధ పూజలు, మహా అన్నదానం
- ఈ నెల 17నుంచి స్వామివారి ఆరాధన మహోత్సవం

అక్కన్నపేట: గుట్టపైన ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం

అక్కన్నపేట, మే 15: మండలంలోని కేశవాపూర్ రామస్వామి గుట్టపైన ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా విరాజిల్లుతున్నాడు. ఈ గుట్టపైన స్వామి వారికి గుడి లేదు.. .గోపురం లేదు. చిన్న రేకుల షెడ్‌లో కొలువైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి నిత్యం పూజలు, నైవేద్యాలతో పాటు ఏటా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మహా అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ నెల 17వ తేదీన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా 'నమస్తే తెలంగాణ' స్టోరీ... మండలంలోని కేశవాపూర్‌కు చెందిన కందారపు రమేశాచార్యులు చిన్నప్పటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి భక్తుడు. మొదట రామస్వామి గుట్టపైన కర్ర చెక్కలతో మందిరంలో స్వామి వారి చిత్రపటం ప్రతిష్ఠించి పూజలు మొదలు పెట్టాడు. తర్వాత స్వామి ఆలయ నిర్మాణం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. 2022లో గుట్టపైన తాత్కాలికంగా రేకుల షెడ్ నిర్మాణం చేపట్టి అమ్మవారి సమేత స్వామి వారి విగ్రహాలు తెప్పించి వారం రోజులు పూజలు చేసి మహా అన్నదానం చేపట్టారు. గుట్టపైన స్వామివారి ఆలయ కోసం ప్రభుత్వం నుంచి 20 గుంటల భూమిని మంజూరు చేయించారు. ఇటీవల కరీంనగర్ ఎంపీ నిధుల నుంచి ప్రహరీ నిర్మాణం కోసం రూ. 3 లక్షలు విడదల చేయించారు. ప్రతి ఏటా మార్గశిర మాసంలో ఈశ్వరీమాత ఆరాధన మహోత్సవం, మాఘమాసంలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం, పాల్గొణ మాసంలో గోవిందమాంబ అమ్మవారి ఆరాధనోత్సవం, వైశాఖ మాసంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవంతో పాటు కార్తికమాసంలో స్వామి వారి జయంతి అత్యంత వైభవంగా జరుగుతాయి. దాతల సహకారంతో ఏడాది పొడువునా మహా అన్నదానం చేస్తున్నారు.

గుట్టపైన కొలువైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

ఆలయం నిర్మించడం సంకల్పం

రామస్వామి గుట్టపైన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం నిర్మించడం సంకల్పంగా భావిస్తున్నా. ఇందుకోసం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం ఉంది. కాళేశ్వరం సమీపంలోని అజామ్‌నగర్‌లోని సరస్వతీ సంస్కృతి వేద పాఠశాలలో వేదాభ్యాసం పూర్తి చేశా. వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనతో పాటు గాయత్రిమాత ఆశ్రమం నిర్వహిస్తున్నా. ఆశ్రమంలో అధ్యాత్మిక విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తక పఠనం, ఉచిత పంచాగ బోధన, ఆర్థిక స్థోమతను బట్టి అన్నప్రాసన, హోమాలు, యజ్ఞయాగాలు, గృహప్రవేశాలు, వివాహాలు ఇతరత్రా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.

-కందారపు రమేశాచార్యులు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రధాన అర్చకులు

రజక కులస్తులకు న్యాయం చేయాలి

హుస్నాబాద్, మే 15 : హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతరలో రజకుల వృత్తికి గౌరవం ఇవ్వకుండా ఇతరులకు టెండర్ కట్టబెట్టడం సరైంది కాదని, వెంటనే రజక కులస్తులకు న్యాయం జరిగేలా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఒక ప్రటకనలో డిమాండ్ చేశారు. గత ఐదారు దశాబ్దాలుగా ఎల్లమ్మ జాతరలో కోళ్లు, గొర్రెలను కోసే టెండర్ రజకులకే వచ్చేదని, ఇటీవల అధికారులు నిర్వహించిన టెండర్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వెంటనే ఇతరులకు కేటాయించిన టెండర్‌ను రద్దు చేసి స్థానికంగా ఉన్న రజకులకు కేటాయించాలని, లేనిచో రజక కులస్తులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మన్ననలు పొందిన అధికారి సావిత్రి

సావిత్రిని సన్మానిస్తున్న జిల్లా అధికారులు

సిద్దిపేట, మే15: జిల్లా సంక్షేమాధికారిగా ఏప్రిల్ 24న ఉద్యోగ విరమణ పొందిన సావిత్రిని బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు గరీమాఅగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి హాజరై సావిత్రిని శాలువాతో సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రెండు నెలలు నిబద్ధతతో పనిచేసి అందరి మన్ననలు పొందిన అధికారి సావిత్రి అన్నారు. అధిక భాగం ఆసిఫాబాద్, ములుగు, ఖమ్మం లాంటి ఆదివాసి జిల్లాల్లో పనిచేసే పేదలకు సేవలు అందించారన్నారు. అనంతరం సావిత్రి మాట్లాడుతూ జిల్లాలో పనిచేయడం సంతోషంగా ఉందని, ఉన్నతాధికారుల పూర్తి సహకారంతో సేవలందించానన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో జయదేవ్, బీసీ సంక్షేమ అధికారి సరోజ, డీపీవో దేవకీదేవి, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి కవిత, డీపీఆర్‌వో రవికుమార్, ల్యాండ్ సర్వే ఏడీ వినయ్, మార్కెటింగ్ ఏడీ నాగరాజు, డీఎంసీఎస్ హరీశ్‌తోపాటు ఇన్‌చారిజ డీడబ్ల్యూవో శారద, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మద్దూరు(ధూళిమిట్ట) : మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న యూత్ అసోసియేషన్ సభ్యులు

చేర్యాల, మే 15 : మండలంలోని శభాష్‌గూడెం గ్రామానికి చెందిన రాజుపేట స్వామి మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. బుధవారం ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే ప్రకటించిన రూ.5 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా విజయం సాధించినప్పటి నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డు స్వప్నకిరణ్, నాయకులు గుడ్దేటి కనకయ్య, గజ్జి కనకయ్య, శ్రీరాములు కనకయ్య, మడిపడిగే భాస్కర్, జెరిపోతుల నర్సింహులు, ప్రభాకర్, మల్లిగారి దుర్గయ్య పాల్గొన్నారు.

నర్సాయపల్లిలో..

మద్దూరు(ధూళిమిట్ట), మే15: మద్దూరు మండలంలోని నర్సాయపల్లికి చెందిన జిందం మల్లేశం రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి నర్సాయపల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 23వేల ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్‌లో కూడా మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చేర్యాల : మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ కరుణాకర్

ఉచిత విద్య అందరికీ అందాలి

సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

సిద్దిపేట టౌన్,మే 15 : ప్రభుత్వ ఉచిత విద్య అందరికీ అందాలని ఇండియన్ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో విద్యను కాషాయాకరణ చేస్తుండటంపై విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా విద్యా సంస్థల యాజమాన్యాలు రాజకీయ నేతలుగా అవతరించడం మూలంగా విద్య వ్యాపారంగా మారిందని ఆరోపించారు. నూతనంగా ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుతో పాటుగా న్యాక్, ఎన్ ఐఆర్ఎఫ్ గుర్తింపు లాంటి పేరుతో విద్యార్థులను ఆకర్షించే వాటిని తెరమీదికి తెచ్చారన్నారు. ప్రైవేటీకరణకు ప్రభుత్వాలు కొమ్ము కాయకుండా అందరికీ నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజు, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాడీల సీజన్ వచ్చేసిందోచ్

హుస్నాబాద్‌టౌన్: వివిధరకాల సైజులో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న జాడీలు

హుస్నాబాద్‌టౌన్, మే 15: పాతకాలపు నాటి జాడీలను ఉపయోగించేందుకు ప్రజలు తిరిగి ఆసక్తి చూపుతున్నారు. కొన్నాళ్లపాటు మరుగున పడిన జాడీలు తిరిగి ఉపయోగంలోకి వచ్చాయి. ప్రస్తుతం మామిడికాయల సీజన్‌రావడంతో తొక్కులు పెట్టేందుకు ప్రజలు వీటిని కొనేందుకు ఆసక్తిచూపుతున్నారు. రూ.120 నుంచి రూ.1000 వరకు పలికే వివిధ రకాల సీజన్ జాడీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

విజయవాడ టు జమ్ముకాశ్మీర్ వయా హుస్నాబాద్

బైక్‌లపై హుస్నాబాద్ నుంచి వెళ్తున్న యువకులు

హుస్నాబాద్, మే 15: విజయవాడ నుంచి జమ్ముకాశ్మీర్ వెళ్లేందుకు ప్రత్యేకమైన బైక్‌లపై ముగ్గురు యువకులు బయలుదేరారు. విజయవాడలో బుధవారం ఉదయం ఆరు గంటలకు బయలుదేరిన ముగ్గురు యువకులు సూర్యాపేట, జనగామ జిల్లాల మీదుగా హుస్నాబాద్‌కు చేరుకున్నారు. అధునాతన, ఖరీదైన బైక్‌లు, ప్రత్యేకమైన దుస్తులు ధరించి బైక్‌లపై వెళ్తున్న యువకులను పట్టణ వాసులు వింతగా చూశారు. ఇది గమనించిన స్థానికులు వారిని ఆపి వివరాలు అడుగగా విజయవాడ నుంచి జమ్ముకాశ్మీర్ బైక్‌లపై వెళ్తున్నట్లు చెప్పారు. మంచిర్యాల, నాగపూర్ హైవే మీదుగా కాశ్మీర్ వరకు 45రోజుల పాటు ప్రయాణం చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి

తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్

బెజ్జంకి, మే 15 : మండలంలోని తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు.ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఓపీ, ఐపీ సంఖ్య పెంచాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ఉపవైద్యాధికారులు శ్రీనివాస్. రాధాకృష్ణ, వైద్యులు శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

చెత్త నిర్వహణ తీరును పరిశీలించిన అధికారులు

క్రాసింగ్‌లోని డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న అధికారులు

బెజ్జంకి, మే 15: మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామపంచాయతీ డంపింగ్ యార్డు లో చెత్త నిర్వహణ తీరును పంచాయత్‌రాజ్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్‌యార్డులో పొడి చెత్త సేకరణలో భాగంగా సేకరించే ప్లాస్టిక్ వస్తులు, అట్టముక్కలు, సీసలు, ఇతర చెత్త సేకరణ వంటి వివరాలను అడిగి తెలుసుకున్నా రు. కొన్ని మండలాలను యూనిట్‌గా తీసుకొని ప్లాస్టిక్ నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెత్త సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన క ల్పించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ సలహాదారు కొండలరావు, స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సురేశ్‌బాబు, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జిల్లా గ్రామాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్‌ఆర్య, డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున్, ఎంపీడీవో లక్ష్మప్ప, ఏపీఎంలు పాల్గొన్నారు.

బెజ్జంకిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మాజీ ఎమ్మెల్యే రసమయి బర్త్‌డే

బెజ్జంకి, మే 15 : బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పుట్టినరోజు వేడుకలను ఆపార్టీ నాయకులు బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, రాజయ్య, నరేశ్, మోహన్, దేవయ్య, భూమయ్య, రాజిరెడ్డి, రమేశ్, శ్రీనివాస్, రాములు, రాజు, తిరుపతి, బాబు, శేఖర్‌బాబు, రవి, సుదర్శన్, శంకర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి

కృష్ణమాచారి (ఫైల్)

దుబ్బాక,మే15: దుబ్బాక మున్సిపల్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కృష్ణమాచారి (59) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. గత పదేండ్లుగా ఆయన దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో విధు లు నిర్వహిస్తున్నారు. కృష్ణమాచారి మృతిపై మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

దుబ్బాక, మే15: దుబ్బాక మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్ రెడ్డి తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

మాట్లాడుతున్న సినీ నటుడు సంపూర్ణేశ్‌బాబు

సిద్దిపేట, మే 15: సిద్దిపేట వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం బుధవారం విపంచి కళానిలయంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నీతి కథలు, చేతిరాత, చిత్రలేఖనం, కర్ర సాము, అబాకస్, నైతిక విలువలు, భగవద్గీత శ్లోకా లు,ఇతర అంశాలపై విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీ హీరో సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ సిద్దిపేట అన్నిరంగాల్లో పురోగమించడం సంతోషకరమన్నారు. బాల్యంలోనే న చ్చిన అంశాన్ని ఎంపిక చేసుకొని శిక్షణ పొంది సాధనతో రాటుదేలితే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులపైన ఉందన్నారు. మరో సినీ నటు డు సిల్వర్ సురేశ్ మాట్లాడుతూ పిల్లలు ఆయా రంగాల్లో సృజనాత్మకతతో ముందుకు వెళ్లేందుకు ఇలాంటి శిక్షణ శిబిరాలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టులు దేవికరెడ్డి, అంజయ్య, సిద్దిపేట టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, విక్రంరెడ్డి, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, యూటీఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు లక్కిరెడ్డి విజయరెడ్డి, బాల సంస్కార్ కోర్స్ డైరెక్టర్ తోట సంధ్య, యోగా శిక్షకులు తోట సతీశ్, తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువరన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి, చిప్ప ప్రభాకర్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు కొమురవెల్లి హుండీల లెక్కింపు

చేర్యాల, మే 15 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో ఏ. బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని 28 హుండీలను లెక్కించి నగదు, బంగారం తదితర వాటిని బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు, పోలీస్, బ్యాంకు అధికారులు హాజరుకావాలని కోరారు.ఆయనతో ఏఈవోలు గంగా శ్రీనివాస్, శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్ ఉన్నారు.

వేచరేణిలో ఘర్షణ

చేర్యాల, మే 15 : మండలంలోని వేచరేణిలో బీరప్ప పండుగ సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి బాగయ్య బంధువులతో కలిసి వచ్చి ఇంట్లో భోజనం చేసి నిద్రిస్తున్న సమయంలో వీధిలో అరుపులు వినబడడంతో బయటకు వచ్చి ఎందుకు అరుపులు చేస్తున్నారు, గొడవ ఏమిటని అన్నాడు. దీంతో ఎగుర్ల కరుణాకర్‌తో పాటు పలువురు వ్యక్తులు భాగయ్యతో పాటు ఇద్దరి బంధువుల పై కర్రలతో దాడిచేయడంతో గాయపడ్డారు.ఎగుర్ల బాగయ్య ఫిర్యాదు మేరకు కొమురవెల్లి ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పట్టభద్రుల ఉప ఎన్నిక సన్నాహక సమావేశం

చేర్యాల, మే 15 : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని ఉషోదయ ఫంక్షన్‌హాల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పట్టణ,మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు,అనంతుల మల్లేశం తెలిపారు. బుధవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10గంటల సమావేశం ప్రారంభమవుతుందని,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీలు, ఎంపీపీలు,ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, గ్రామశాఖల అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.ఉప ఎన్నిక సన్నాహక సమావేశానికి పట్టభద్రులు భారీగా తరలి వచ్చే విధంగా పార్టీ బాధ్యులు, ప్రజాప్రతినిదులు కృషి చేయాలని కోరారు.

వృద్ధురాలిని తప్పించబోయి కారు బోల్తా

ప్రమాదంలో బోల్తాపడిన కారు

గజ్వేల్, మే 15 : రాజీవ్ రహదారిపై వృద్ధురాలిని తప్పించబోయి కారు బోల్తాపడిన సంఘటన మండల పరిధిలోని కొడకండ్లలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారుకు కొడకండ్ల వద్ద వృద్ధురాలు అడ్డు రావడంతో ఆమెను తప్పించబోయి సడన్‌బ్రేక్ వేయగా రాంగ్‌రూట్లోకి వెళ్లి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొని బోల్తా పడింది. కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో ఎవరికీ ఎలాంటి అపాయం జరుగలేదు. ఈ ప్రమాదంలో రెండు కార్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. రాజీవ్ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సాయంలో కారును పోలీసులు పక్కకు తీయడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

గ్రూప్ -1 అభ్యర్థులకు గ్రాండ్ టెస్టులు

సిద్దిపేట టౌన్,మే 15 : సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్‌లో ఆఫ్‌లైన్ విధానంలో గ్రూప్-1అభ్యర్థులకు గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించనున్నామని స్టడీసర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణదయాసాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాండ్ టెస్టులు ఈ నెల 18 నుంచి జూన్ 3 వరకు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 99666730 95,08457-22491 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మందు బాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్,మే 15 : మద్యం తాగి వాహనాలు నడిపిన మందు బాబులకు సిద్దిపేట న్యాయస్థానం జరిమాన విధిస్తూ బుధవారం తీర్పును వెలువరించింది.సిద్దిపేట వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు వివరాల ప్రకారం..సిద్దిపేట సర్కిల్ పరిధిలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు.ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 22 మందిని పట్టుకున్నామని చెప్పారు. ఈ మేరకు మందు బాబులను న్యాయమూర్తి శ్రావణి ఎదుట హాజరుపర్చామని..విచారణ జరిపి మద్యతాగి వాహనాలను నడిపిన 22 మంది వాహనదారులకు రూ.25వేల 500 జరిమానా విధించారన్నారు.